www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 19 మార్చి 2024



ప్రశాంతంగా ఇంటర్ బ్రిడ్జ్ కోర్సు పరీక్ష

జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ బి.ప్రభాకర్‌రావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ బ్రిడ్జ్ కోర్స్ పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు ఏలూరు జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ బి.ప్రభాకర్‌రావు తెలిపారు. ఏలూరు జిల్లాలో 12 కేంద్రాల్లో జరిగిన ద్వితీయ సంవత్సరం బ్రిడ్జ్ కోర్స్ పరీక్షకు మొత్తం 1,261 మందికి గాను 895 మంది హాజరు కాగా 366 మంది గైర్హాజరయ్యారు. ఇందులో సాధారణ విద్యార్థులు 109 మందికి 109 మంది గైర్హాజరయ్యారు. ఒక్కరు కూడా హాజరు కాలేదు. వృత్తి విద్యా విభాగంలో 1,152 మందికి 895 మంది హాజరు కాగా 257 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 71 శాతం హాజరు నమోదైంది. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఈ రోజుతో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ముగిశాయని ప్రభాకర్‌రావు తెలిపారు.

అభ్యర్థుల ప్రదక్షిణలు..!

పెద్దలు, నేతల ప్రసన్నమే లక్ష్యంగా పర్యటనలు
సమస్యలపై కానరాని కేంద్రీకరణ

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. కోడ్ అమల్లో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. అభ్యర్థుల ఎంపిక పూర్తి చేసిన అధికార వైసిపి ఇప్పటికే వివిధ రూపాల్లో ప్రచారాన్ని ప్రారంభించింది. ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థులు సైతం ఏదో రూపంలో ఓటర్లను కలిసే ప్రయత్నం చేస్తున్నారు. ఇక ప్రతిపక్ష టిడిపి తాను పోటీ చేసే స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించడంతో వారు కూడా ప్రచారానికి తెర లేపారు. అదే సమయంలో ఆ కూటమిలోని జనసేన పోటీ చేసే స్థానాలపై స్పష్టత వచ్చినా, అభ్యర్థులు దాదాపు ఖరారైన అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. బిజెపికి కేటాయించినట్లు చెబుతున్న కైకలూరు అసెంబ్లీ, నరసాపురం ఎంపీ స్థానాల్లో అభ్యర్థులు ఖరారు కావాల్సి ఉంది. అయితే ఎన్నికల షెడ్యూల్‌లో పోలింగ్ ఏప్రిల్ 3, 4 నాలుగు వారాల్లో జరుగుతుందని అన్ని పార్టీల నేతలు భావించారు. అయితే అనూహ్యంగా మే రెండో వారానికి పోలింగ్ తేదీ వెళ్లిపోవడంతో ఇప్పటికే పార్టీల నేతలు, అభ్యర్థుల్లో గుబులు నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అభ్యర్థులు తమ ప్రచార తీరును మార్చినట్లు రెండు రోజులుగా జిల్లాలో పరిస్థితులు చెప్పకనే చెబుతున్నాయి. నేరుగా ఓటర్లను కలిసే సమయం తగ్గించుకుని ప్రధానంగా ఓటర్లను ప్రభావితం చేసే ఆయా గ్రామాలు, ప్రాంతాల్లోని పెద్దల చుట్టూ అభ్యర్థులు ప్రదక్షిణలు చేస్తున్నారు. దీంతో పాటు ఆయా నేతలను ప్రసన్నం చేసుకోవడానికి ఆయా ప్రాంత ఓటర్లను తమ వైపు తిప్పుకోవడానికి ఇవ్వాల్సిన హామీలు, చేయాల్సిన పనుల గురించి చర్చిస్తూ ముందుకు సాగుతున్నారు. ఇప్పటి నుంచే ఎన్నికల ప్రచారం అంటే సుమారు నెలా 20 రోజుల పాటు ప్రచార ఖర్చులు, ఇతర ఖర్చులు భరించడం కష్టమనే అభిప్రాయంతో ఎక్కువ మంది అభ్యర్థులు ఈ మార్గాన్ని ఎన్నుకున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు ఏప్రిల్ రెండో వారం తర్వాత నేరుగా ఓటర్లను కలిస్తే సరిపోతుందని, లేనిపక్షంలో రెండు, మూడు సార్లు తిరగాలంటే ఖర్చు తడిచి మోపెడవుతుందని అభ్యర్థుల అనుచరులు వ్యాఖ్యానిస్తున్నారు. అదే సమయంలో ఇప్పటికే ప్రచారం ప్రారంభించినవారు రోజు ఒక గంట లేదా రెండు గంటలు ఓటర్లను కలుస్తూ పెద్దలను కలిసే పనే ప్రధానంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే రెండు జిల్లాల్లో కొన్ని నియోజకవర్గాల్లో అధికార, ప్రతిపక్ష అభ్యర్థులు మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు తాయిలాలు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. అయితే ఎన్నికల గడువు ఎక్కువ సమయం ఉండడంతో ఎటువంటి ఇబ్బందీ లేకుండా నామినేషన్ల పర్వం ముగిసి ప్రచారం తారాస్థాయికి చేరేటప్పటికి మరోసారి తాయిలాలు ఏం పంపిణీ చేయాలన్న దానిపై నేతలు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.



ఇదీలా ఉండగా అభ్యర్థులు, నేతలు పెద్దలను తమ వైపు తిప్పుకోవడం, ఓటర్లను ప్రలోభానికి గురి చేయడంపై పెడుతున్న దృష్టి నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి ఏం చేస్తారో, కార్యాచరణ ఏంటో అనే అంశాలపై దృష్టి పెట్టకపోవడం విస్మయం కలిగిస్తోంది. నేతలు, పెద్దలు చెప్పిన సమస్యలు తప్ప ప్రజాసమస్యలు ఎజెండాలోకి వచ్చే అవకాశాలు ప్రస్తుత పరిస్థితుల్లో కానరావడం లేదు. ఓటర్లు ప్రధానంగా యువత తమ ప్రాంత మౌలిక సమస్యల పరిష్కారంపై ఆయా అభ్యర్థులను ప్రశ్నించి స్పష్టమైన వైఖరి ప్రకటించాలని కోరడం తప్ప మరో గత్యంతరం కనిపించడం లేదని మేధావులు అభిప్రాయపడుతున్నారు. నామినేషన్ల పర్వం ముగిశాక సాగే ప్రచారంలోనైనా అభ్యర్థులు, ఆయా పార్టీల నేతలు ప్రజా సమస్యలపై దృష్టి పెడతారో, లేక ప్రలోభాలపైనే ఆధార పడతారో వేచి చూడాలి.

తల్లిదండ్రులను పట్టించుకోకుంటే క్రిమినల్ కేసులు

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

తల్లిదండ్రులను నిరాదరణకు గురిచేసే పిల్లలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ద్వారకా తిరుమల తహశీల్దార్‌ను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం విధుల అనంతరం క్యాంపు కార్యాలయానికి బయలుదేరిన కలెక్టర్‌ను ద్వారకాతిరుమల మండలం పి.కన్నాపురం గ్రామానికి చెందిన బొప్పన చిట్టెమ్మ కలిసి తన బాధ తెలిపి న్యాయం చేయాలని కోరింది. తనకు ముగ్గురు కుమారులని, పెద్ద కుమారుడు, మూడో కుమారుడు మరణించారని, రెండో కుమారుడు తనను పట్టించుకోవడం లేదని, తనకు ఎటువంటి ఆధారం లేదని న్యాయం చేయాలని విలపించింది. స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ద్వారకాతిరుమల తహశీల్దార్‌కు ఫోన్ చేసి వెంటనే విచారణ చేయాలని ఆదేశించారు. వృద్ధుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చారని, తల్లిదండ్రులను నిరాదరణకు గురిచేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దని, అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. తన సమస్యపై వెంటనే స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు చిట్టెమ్మ కృతజ్ఞతలు తెలిపింది.

23,171 పోస్టర్లు, బ్యానర్లు తొలగించాం

జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల కోడ్ వచ్చిన సందర్భంగా రాజకీయ ప్రకటనలకు సంబంధించి 23,171 పోస్టర్లు, బ్యానర్లు, ఫొటోలు తొలగించినట్లు జిల్లా పరిషత్ సిఇఒ, జిల్లా ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు నోడల్ అధికారి కెఎస్ఎస్.సుబ్బారావు తెలిపారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రభుత్వ పథకాలకు సంబంధించి పబ్లిక్ ఆస్తులకు సంబంధించిన ఫొటోలతో కూడిన 883 వాల్ రైటింగ్లు, 5,717 పోస్టర్లు, 5,634 బ్యానర్లు, 2,140 హోర్డింగులు, జెండాలు వంటివి మొత్తం 14,374 తొలగించినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ నిబంధన ప్రకారం దేశ, రాష్ట్ర నాయకులకు చెందిన 2,697 విగ్రహాలకు ముసుగులు వేసినట్లు తెలిపారు. అదే విధంగా ప్రయివేట్ ప్రదేశాలలో ఉన్న 558 వాల్ రైటింగ్లు, 3,778 పోస్టర్లు, 2,981 బ్యానర్లు, 1,480 హోర్డింగులు, జెండాలు వంటివి మొత్తం 8,797 తొలగించినట్లు తెలిపారు. దేశ, రాష్ట్ర నాయకులకు చెందిన 4,052 విగ్రహాలకు ముసుగులు వేసినట్లు తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పూర్తి సన్నద్ధతతో ఉన్నామని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ నియోజకవర్గానికి ఎన్నికలు జరగనున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 16,65,512 మంది ఉండగా వారిలో పురుషులు 7,93,829 మంది, మహిళలు 8,31,701 మంది ఉన్నారని తెలిపారు. థర్డ్ జెండర్ 125 మంది, సర్వీసు ఓటర్లు 686 మంది ఉన్నారని పేర్కొన్నారు. 85 ఏళ్ల, అంతకంటే ఎక్కువ వయస్సు గల ఓటర్లు 8,488 మందిని గుర్తించామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే అవకాశాన్ని కల్పించడంలో భాగంగా వికలాంగులకు, 85 ఏళ్ల మరియు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న ఓటర్లకు వారి ఇళ్ల వద్ద నుంచే ఓటు వేసే అవకాశం కల్పించామని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 1,743 పోలింగ్ కేంద్రాలున్నాయని, వాటిలో పట్టణ ప్రాంతాల్లో 320, గ్రామీణ ప్రాంతాల్లో 1423 ఉన్నాయని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 415 గుర్తించామని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలపై అటు అధికారులు, సిబ్బందికి, ఇటు రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివిధ రూపాల్లో అవగాహన కల్పించామని తెలిపారు. ఇవిఎంలకు సంబంధించి కంట్రోల్ యూనిట్లు 4,406 యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు 5,494, వివిప్యాట్‌లు 5,254 సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. వేలేరుపాడు మండలం కాకిస్‌నూరు వెళ్లేందుకు పోలింగ్ సిబ్బందికి బోటు సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు.

ఎన్నికల నిర్వహణకు 16 మంది నోడల్ అధికారులు : 16, 193 సెక్టార్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులు 10,458 మందిని నియమించామని, అలాగే స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ 30, ఫ్లయింగ్ స్క్వాడ్స్ 34, వీడియో నిఘా బృందాలు 30, వీడియో వీక్షణ బృందాలు 8, అకౌంటింగ్, వ్యయ బృందాలు ఎనిమిది ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఎలాంటి విధులను సచివాలయ పరిధిలోని వలంటీర్లకు అప్పగించడం లేదని, ఎక్కడైనా ఎన్నికల విధులకు పరోక్షంగా వలంటీర్లు సహకరిస్తున్నారనే విషయం తమ దృష్టికి వస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ అన్ని రాజకీయ పార్టీలు, పోటీలోనున్న అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించరాదని పేర్కొన్నారు. సభలు, సమావేశాలు, వాహనాలకు ముందస్తు అనుమతి పొందాలని తెలిపారు. జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, కాల్ సెంటర్ నెంబర్ 1800-233-1077ను వినియోగించుకోవాలని కోరారు. ఏలూరు సిఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏడు నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

విద్యార్థులకు అసౌకర్యం లేకుండా చర్యలు

'పది' పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరుస్పోర్ట్స్

జిల్లాలో పది పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. జిల్లాలో సోమవారం ప్రారంభమైన పది పరీక్షల నేపథ్యంలో నగరంలోని సెయింట్ థెరిస్సా హైస్కూల్లో పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పరిశీలించారు. పరీక్షా హాల్లో తాగునీరు, ఫ్యాన్లు, బల్లలు తదితర సౌకర్యాలను పరిశీలించారు. వేసవి దృష్ట్యా పరీక్షా హాల్లో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల వెంట సెల్‌ఫోన్, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించొద్దని, వాటిని భద్రపర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల హాజరు పట్టీ ప్రకారం విద్యార్థులు ఉన్నారో, లేదో అన్న విషయాన్ని కలెక్టర్ పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఒఆర్ఎస్ ప్యాకెట్లు తగినన్ని సిద్ధంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట డిఇఒ ఎస్.అబ్రహం, ప్రభృతులు ఉన్నారు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్‌పి కలెక్టర్



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి


పది పరీక్షలకు పటిష్ట బందోబస్తు : ఎస్‌పి

పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి తెలిపారు. నగరంలోని పదో తరగతి పరీక్షా కేంద్రమైన కెపిటిటి ఉన్నత పాఠశాలతో పాటు పలు పాఠశాలలను జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. అంతేకాకుండా పరీక్ష రాసే విద్యార్థులు పరీక్ష హాల్లోకి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌ను అనుమతించకుండా ఉండేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

మలేరియా నిర్మూలనకు కృషి : డిఎంఒ సురేష్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా మలేరియా అధికారి జె.సురేష్ తెలిపారు. సోమవారం మండలం లోని జీలుగుమిల్లి, కామయ్యపాలెం పిహెచ్‌సిలను సందర్శించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిల్లో మలేరియా కేసుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మలేరియాకు సంబంధించి కిట్లను ల్యాబ్‌ల్లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా పట్ల నిర్లక్ష్యంగా ఉండొద్దని సిబ్బందిని ఆదేశించారు. ముందుగానే సిబ్బంది అప్రమత్తమై ఏజెన్సీ ప్రాంతాల్లో, నిర్వాసిత గ్రామాల్లో, వసతిగృహాల్లో ఎప్పటికప్పుడు దోమల మందు పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి గాయత్రి, హేమలత, సబ్ యూనిట్ అధికారి పెద్దిరాజు, ఫార్మాసిస్ట్ నాగేశ్వరరావు, సిహెచ్ఒ శ్రీనివాసరాజు, ల్యాబ్ టెక్నీషియన్ మంగతాయారు, ప్రసాద్, సువర్ణ, కేజియ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిఎంఒ సురేష్

వీధులన్నీ శుభ్రంగా ఉంచాలి : మున్సిపల్ కమిషనర్

జంగారెడ్డిగూడెం టౌన్ : మున్సిపాల్టీలో వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ నరేంద్రకుమార్ కార్మికులను ఆదేశించారు. మున్సిపల్ సిబ్బందితో సమావేశం సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాల్టీలోని వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయాలని, డ్రెయినేజీలు ఎప్పటికప్పుడు శానిటేషన్ నిర్వహించాలని తెలిపారు. మున్సిపల్ వర్కర్లందరూ కలిసికట్టుగా పనిచేసి మున్సిపాల్టీని జిల్లాలో మొదటి స్థానంలో నిలపాలని తెలిపారు. పనిలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్మికులకు సమస్యలేమైనా ఉన్నాయా అని అడగ్గా దానికి మున్సిపల్ కార్మికులు మున్సిపాల్టీలో తక్కువ మంది సిబ్బంది ఉండడం వల్ల పని భారం ఎక్కువవుతుందని, ప్రస్తుతం 96 మంది పని చేస్తున్నారని, కనీసం 120 మంది ఉంటే పని భారం తగ్గుతుందని తెలిపారు. గ్లౌజులు, మాస్కులు అందించాలని, పిఎఫ్ సమస్యను పరిష్కరించాలని కోరారు. జీతాల విషయంలో ఒక్కొక్కరికి నాలుగేసి అకౌంట్లు ఉన్నాయని, ఏ అకౌంట్లో జీతం పడుతుందో అయోమయంగా ఉందని, కాంట్రాక్టర్స్ మారినప్పుడల్లా కొత్త అకౌంట్లు చేయిస్తున్నారని, దీనివల్ల ఇబ్బందులు గురవుతున్నామని సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన కమిషనర్ సమస్యలన్నీ త్వరలోనే పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు, వర్కర్స్ పాల్గొన్నారు.



ఏలూరులోని పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

ప్రశాంతంగా 'పది' పరీక్షలు



మండవల్లి: పరీక్షకు హాజరైన విద్యార్థులు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మొదటిరోజు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ముగిశాయని, ఈ పరీక్షలకు 1758 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి అబ్రహం తెలియజేశారు. జిల్లాలో 139 సెంటర్లలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించారు. సోమవారం జరిగిన మొదటి భాష పేపర్ వన్ పరీక్షకు 25,939 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 24,181 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 1758 మంది హాజరుకాగ వీరి హాజరు శాతం 93.22గా నమోదైంది. జిల్లావ్యాప్తంగా 29 పరీక్ష కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీలు చేసింది. జిల్లా కలెక్టర్ స్వయంగా ఒక పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. జిల్లాస్థాయి అబ్జర్వర్లు 6 పరీక్షా కేంద్రాలను, జిల్లా విద్యాశాఖ అధికారి ఏడు పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు. ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఐదు పరీక్ష కేంద్రాలను, జిల్లావ్యాప్తంగా మొత్తం 48 పరీక్ష కేంద్రాలు విద్యాశాఖ అధికారులు తనిఖీ చేశారు. సోమవారం నిర్వహించిన పరీక్షల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని, ఏ విద్యార్థి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడలేదని జిల్లా విద్యాశాఖ అధికారి అబ్రహం ఒక ప్రకటనలో తెలియజేశారు.

భీమడోలు: మండలంలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణ కోసం గత సంవత్సరం కేటాయించిన పరీక్షా కేంద్రాలకు అదనంగా ఒక ప్రయివేటు పాఠశాలను ప్రత్యేకించారు. మండల పరిధిలోని ఆరు పరీక్షా కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన పరీక్షలకు 1,294 మంది హాజరుకావాల్సిందిగా వీరిలో 1,200 మంది మాత్రమే హాజరయ్యారు. భీమడోలు పరీక్షా కేంద్రంలో 344కు గాను 328 మంది, గుండుగొలను పరీక్షా కేంద్రంలో 262 మందికి గాను 193 మంది, ఆగడాల లంక పరీక్షా కేంద్రంలో 145 గాను 138 మంది, పొలసానిపల్లి బిఆర్ అంబేద్కర్ గురుకులం పరీక్షా కేంద్రంలో 189 మందికి గాను 183 మంది, ప్రయివేటు పాఠశాల భీమడోలు శ్రీచైతన్య పాఠశాలలో 136 గాను 135 మంది హాజరయ్యారని మండల విద్యాధికారులు ఇద్దరూ తెలిపారు.

ద్వారకా తిరుమల: మండలంలోని మూడు సెంటర్లలో పదో తరగతి పరీక్షలు మొదటి రోజు ఫస్ట్ పేపర్ తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండల విద్యాశాఖాధికారులు పి.వెంకట్రావు, ఇ.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం ద్వారకా తిరుమల దేవస్థానం హైస్కూల్, శ్రీనివాసరావు జూనియర్ కాలేజ్ ద్వారకాతిరుమల, డీపాల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఎం.నాగులపల్లి మొత్తం మూడు సెంటర్లలో కలిపి పరీక్షకు 356 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా 304 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. 52 మంది గైహాజరయ్యారు. మండల విద్యాశాఖాధికారులు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

కొయ్యలగూడెం: మండలంలో 10వ తరగతి పరీక్షలకు 1094 మంది విద్యార్థులకు 946 మంది విద్యార్థులు హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారి జె.సురేష్ బాబు తెలిపారు. మొత్తం పరీక్ష కేంద్రాలు కొయ్యలగూడెం మండలంలో 5 ఉండగా ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 211 మంది విద్యార్థులకు 191 మంది విద్యార్థులు, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పరింపుడిలో 240 మంది విద్యార్థులకు 218 మంది విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కన్నాపురంలో 263 మంది విద్యార్థులకు 234 మంది విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బయ్యనగూడెంలో 286 మంది విద్యార్థులకు 255 మంది విద్యార్థులు, ఆగ్జిలియం ఉన్నత పాఠశాల గవరవరంలో 94 మంది విద్యార్థులకు 48 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలియజేశారు.

పోలవరం : మండలంలో తొలి రోజు పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని గూటాల జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 116 మంది విద్యార్థులకు వంద మంది విద్యార్థులు, పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 262 మంది విద్యార్థులకు 256 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. పదో తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఆవరణ వద్ద పోలీసులు బందోబస్తు పటిష్టంగా నిర్వహించారు.

మండవల్లి: పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని ఎంఇఒ డి.రామారావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు నిర్వహించేలా పూర్తిస్థాయిలో సౌకర్యాలు ఏర్పాటు చేసామని తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చెందిన 456 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించేందుకు మూడు కేంద్రాల ఏర్పాటు చేశామన్నారు. మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, చింతపాడు జిల్లా పరిషత్ పాఠశాలను ఏర్పాటు చేశామని అన్నారు. మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పరీక్ష కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 190 మంది పరీక్షకు హాజరు కావలసి ఉండగా 183 మంది పరీక్షకు హాజరవ్వగా ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రయివేటు పాఠశాలలకు చెందిన 27 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 13 మంది పరీక్షకు హాజరవుగా, 14 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పరీక్ష కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలకు చెందిన 66 మంది పరీక్షకు హాజరు కావలసి ఉండగా 60 మంది పరీక్షకు హాజరు అవగా, ఆరుగురు గైర్హాజరయ్యారు. ప్రయివేటు పాఠశాలలకు చెందిన 11 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావలసి ఉండగా 10 మంది హాజరవ్వగా, ఒక్క విద్యార్థి గైర్హాజరయ్యారని తెలిపారు. మొదటి రోజు నిర్వహించిన మూడు పరీక్ష కేంద్రాలలో 456 మంది పరీక్షకు హాజరు కావలసి ఉండగా 411 మంది హాజరవుగా, 45 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన తెలియజేశారు.

జీలుగుమిల్లి: మండలవ్యాప్తంగా పది పరీక్షలు సోమవారం నుంచి ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలవ్యాప్తంగా జీలుగుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బర్రింకలపాడులోని గిరిజన గురుకల పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. రెండు కేంద్రాల గుండా మొత్తం 480 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా, 58 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఇఒ ఎస్.బుచ్చయ్య తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగకుండా పటిష్ట భద్రతను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలియజేశారు.

చింతలపూడి: మండలంలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. చింతలపూడి ఎంఇఒ కిరణ్ బాబు తెలిపిన వివరాల ప్రకారం మండలానికి ఏడు సెంటర్లు ఇచ్చారని, 1,345 మంది విద్యార్థులకు 1262 మంది పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. 83 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలియజేశారు.

చాట్రాయి: మండలంలో 10వ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభం కాగా మొత్తం విద్యార్థులు 396 మంది పరీక్షలకు హాజరు కావలసి ఉండగా, 358 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని ఎంఇఒ బ్రహ్మాచారి తెలిపారు. 38 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. చాట్రాయిలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 223 మంది విద్యార్థులకు గాను 205 మంది విద్యార్థులు హాజరయ్యారు. 18 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆర్‌సిఎం పాఠశాలలో 173 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావలసి ఉండగా 153 మంది విద్యార్థులు హాజరయ్యారయ్యారు. 20 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. విద్యార్థులకు వైద్య సదుపాయం కోసం ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలను నియమించడం జరిగిందని ఎంఇఒ తెలియజేశారు.

జంగారెడ్డిగూడెం టౌన్: జంగారెడ్డిగూడెం పట్టణంలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులంతా పరీక్షా సమయానికి ముందుగానే వారికి కేటాయించిన పరీక్షా కేంద్రాల వద్దకు వారి తల్లిదండ్రులతో చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద కోలాహల వాతావరణం నెలకొంది. జంగారెడ్డిగూడెం అన్ని సెంటర్లు కలుపుకొని మొత్తం విద్యార్థులు 2012 మంది హాజరు కావాల్సి ఉండగా 1942 మంది మాత్రమే పరీక్షకు హాజరైయ్యారు. 70 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఇఒ రాముడు తెలియజేశారు.

కలిదిండి : 10వ తరగతి పబ్లిక్ పరీక్షల తొలిరోజు తెలుగు పరీక్షకు 66 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఇఒ పిడుగు ప్రభాకర బాబు తెలిపారు. మండలంలోని ఆరు పరీక్షా కేంద్రాలైన ఆరుతెగలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 178 మందికి 156 మంది హాజరుకాగా 22 మంది గైర్హాజరయ్యారు. కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 328కి 324 మంది హాజరు కాగా నలుగురు గైర్హాజరయ్యారు. కోరుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 267 మందికి 254 మంది హాజరు కాగా 13 మంది గైర్హాజరయ్యారు. భాస్కరరావు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 139 మందికి 135 హాజరు కాగా నలుగురు గైర్హాజరయ్యారు. కలిదిండి శశి హైస్కూల్‌లో 21 మందికి 8 మంది హాజరు కాగా 13 మంది గైర్హాజరయ్యారు. కోరుకొల్లు క్రాంతి హైస్కూల్‌లో 20 మందికి 10 మంది హాజరై, మరో 10 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. మొత్తం 953 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 887 మంది హాజరయ్యారని ప్రభాకర బాబు తెలిపారు.

టి.నరసాపురం : మొదటిరోజు పదవ తరగతి తెలుగు పరీక్ష ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు మండల విద్యాశాఖాధికారులు టి.రామ్మూర్తి, ఎస్.కళ్యాణి సోమవారం తెలిపారు. మొత్తం 581 మంది విద్యార్థులకు 534 మంది విద్యార్థులు హాజరు కాగా 47 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదన్నారు. టి.నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 216 మందికి 187 మంది, బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల-ఎ కేంద్రంలో 258 మందికి 248 మంది, బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల-బి కేంద్రంలో 33 మందికి 24 మంది విద్యార్థులు, అప్పలరాజు గూడెం గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రంలో 74 మంది విద్యార్థులకు 73 మంది పరీక్షకు హాజరైనట్లు వారు తెలిపారు.


ముదినేపల్లి: మండలంలో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. మండల వ్యాప్తంగా నాలుగు సెంటర్లలో మొత్తం 678 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 624 మంది మాత్రమే పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 54 మంది విద్యార్థులు గైర్హాజరైయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముదినేపల్లి ఎస్ఐ డి.వెంకట్ కుమార్ పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ముదినేపల్లిలోని జెడ్‌పి హైస్కూల్, సహాయ మాత హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు మండలంలోని పెదగొన్నూరు జెడ్‌పి స్కూల్‌లో పదో తరగతి పరీక్షలు నిర్వహించారు.

ముసునూరు: మండలంలోని 16 గ్రామాల విద్యార్థులు ఎటువంటి ఇబ్బంది లేకుండా పరీక్షా సమాయానికి పరీక్ష కేంద్రానికి హాజరైనట్లు ఎంఇఒ బివి.సుబ్బారావు తెలిపారు. సోమవారం నిర్వహించిన తెలుగు పరీక్షకు ముసునూరు హైస్కూల్ పరీక్ష కేంద్రంలో ముసునూరు, ముసునూరు గురుకుల పాఠశాల, భారతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులతో కలిపి 210 మందికి గాను 9 మంది గైర్హాజరుకాగా, 201 మంది హాజరైయ్యారు. చక్కపల్లి పరీక్ష కేంద్రంలో చక్కపల్లి హైస్కూల్ విద్యార్థులు, గుడిపాడు హైస్కూల్, రమణక్కపేట హైస్కూల్, చాట్రాయి మండలం మర్లపాలెం హైస్కూల్, చైతన్య ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులతో కలిపి 242 మందికి గాను 10 మంది విద్యార్థులు గైర్హాజరుకాగా, 232 మంది పరీక్ష రాశారు. గోపవరం హైస్కూల్ పరీక్ష కేంద్రంలో గోపవరం హైస్కూల్, వేల్పుచర్ల హైస్కూల్, కాట్రేనిపాడు హైస్కూల్ విద్యార్థులతో కలిపి 167 మందికిగాను, 28 మంది గైర్హాజరైనట్లు డివిజనల్ విద్యాశాఖాధికారి సేవ్యా తెలిపారు.

అఖండ మెజారిటీతో గెలిపించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

గ్రామంలోని ప్రజలంతా అండగా ఉండి, ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని వైసిపి చింతలపూడి నియోజకవర్గ అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. చింతలపూడి పట్టణంలో సుబ్బిపేట వద్ద కమిటీ హాల్‌లో సోమవారం పరిచయ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉంటానని, ప్రతి ఒక్కరికీ తోడుగా ఉంటూ అందరినీ కలుపుకొని వెళ్తాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, టౌన్ అధ్యక్షులు కొప్పుల నాగు, సచివాలయాల కన్వీనర్ శ్రీనివాస్, వైస్ ఎంపిపి వరలక్ష్మి, గంధం చంటి, అత్యూరి సుబ్బారావు, మద్దాల ఏలియా, వైసిపి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




టిడిపిలోకి ఆహ్వానిస్తున్న సొంగ రోషన్ కుమార్

టిడిపిలోకి పలువురు

ప్రజాశక్తి - చింతలపూడి

రాష్ట్రంలో ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీల సంక్షేమానికి పాటు పడేది చంద్రబాబు నాయుడు అని చింతలపూడి నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి సొంగ రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడి మండలంలోని సోమవారం పట్టాయిగూడెంలో పలువురు నాయకులు వారి అనుచరులతో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా రోషన్, సీనియర్ టిడిపి నాయకులు ముత్తారెడ్డి టిడిపి కండువా కప్పి ఆహ్వానం పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ఎస్‌సి, ఎస్‌టి మైనార్టీలకు ఒరిగిందేమీ లేదని, కేవలం వారిని ఓటు బ్యాంకుగా వాడు కోవడమే వైఎస్ జగన్ పని అని అన్నారు. చంద్రబాబు హయాంలోనే వారి అభివృద్ధి జరిగిందని తెలిపారు. టిడిపి నాయకులు గోరుముచ్చు గోపాల యాదవ్, సురవనే గోపీ, సత్యంబాబు, నాయన బాబు, మాజీ మార్కెట్ చైర్మన్ కోనేరు సుబ్బారావు, కోటగిరి వేణు, సర్పంచి వెంకటేశ్వరరావు తదితర నాయకుల సమక్షంలో జె.వినోద్, ఎస్‌కె.గఫూర్, తాళ్లూరి రాజారావు టిడిపిలో చేరారు.



కృత్రిమ కాలు అందజేస్తున్న ప్రతాప్

కృత్రిమ కాలు అందజేత

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

సమృద్ధి కలిగిన వారు లేనివారికి సహాయపడటమే మానవత్వమని హీల్ సంస్థ కార్యదర్శి తాతినేని లక్ష్మి అన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త అడుసుమిల్లి ప్రతాప్ తన భార్య అడుసుమిల్లి కృష్ణకుమారి జ్ఞాపకార్థం విరాళంతో తోటపల్లి హీల్ ప్యారడైజ్‌లోని ఎలిజబెత్ పాంటన్ లెగ్స్ అప్ హోప్ కృత్రిమ అవయవ కేంద్రంలో నిడదవోలుకు చెందిన బాలిక బట్టు శ్రుతికి అడుసుమిల్లి ప్రతాప్ కృత్రిమ కాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హీల్ పేరెంటింగ్ డైరెక్టర్ టి.భాస్కర్, సిఇఒ కె.అజయ్‌కుమార్, సీనియర్ టెక్నీషియన్ కె.చిన్నా పాల్గొన్నారు.

'మాకు న్యాయం చేయాలి'

ప్రజాశక్తి - చింతలపూడి

చంద్రబాబును మాలలంతా ఎందుకంత దుఃఖంగా అని మాల మహాసేన జాతీయ అధ్యక్షులు అలగా రవి ప్రశ్నించారు. ఆయన ఒక ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం రానున్న 2024 ఎలక్షన్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మూడు అసెంబ్లీ స్థానాలు ఎస్‌సి రిజర్వుడ్ స్థానాలు ఉన్నాయని, ఈ మూడు స్థానాల్లో మాదిగ సోదరులకు కేటాయించడం, టిడిపిలో పనిచేసిన మా మాల సోదరులకు ఇవ్వకపోవడం తమని అవమానపరచడం అవుతుందన్నారు. మాలలందరినీ బాధ పెట్టడం జరిగిందని, దానికి మూల్యం మీరే చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. మాదిగలకు ఎస్‌సి వర్గీకరణ చేసి న్యాయం చేశానని చెప్పిన మాట వాస్తవం కాదన్నారు. మానిపోయిన గాయాన్ని తిరిగి గుర్తు చేసి ఎన్నికల వాతావరణంలో మాలలను బాధ పెట్టడం మీకు సరైన పనేనా అని ప్రశ్నించారు. దీనికి టిడిపిలో ఉన్న మాలలంతా స్పందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహాసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సరిపల్లి పెద్దిరాజు, మాల మహాసేన జిల్లా అధ్యక్షుడు కొమ్మిన అగస్టిన్, జిల్లా యువజన కార్యదర్శి ఆనంద రాజు పాల్గొన్నారు.

వైసిపిలోకి పలువురు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వడాలి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధికి యువకులు ఆకర్షితులై పెద్ద ఎత్తున సోమవారం రాత్రి 150 మంది వైసిపిలో చేరారు. డిఎన్ఆర్ తనయులు దూలం వీర ఆది వినయ్ కుమార్ సమక్షంలో కటికల మునియ్య, పాండురంగారావు ఆధ్వర్యంలో వైసిపిలోకి చేరారు. వీరందరికి దూలం వినయ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, నాయకులు ఈడే వెంకటేశ్వరావు, ఎఎంసి వైస్ చైర్మన్ బత్తిన కిషోర్, మరీదు హనుమంత్, రాష్ట్ర బిసి నాయకులు కోమటి విష్ణువర్ధన్, ముద్రివాడ వీర రెడ్డి సుధాకర్ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు షేక్ అల్లాబక్ష్, రాచూరి కుమార్, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైసిపిలోకి చేరుతున్న యువకులు

నేరాలు - ఘోరాలు

గొడ్డలితో దాడి ఘటనలో వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన పొలిమేర నాగరాజు అదే గ్రామానికి చెందిన అబ్బ దాసరి కాంతారావును పాత గొడవల నేపథ్యంలో గొడ్డలితో దాడి చేయగా, తలమీద రక్త గాయమైంది. కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో ఎస్ఐ డి.దుర్గా మహేశ్వర రావు కేసు నమోదు చేయడంతో పాటు ముద్దాయిని అరెస్టు చేసి, చింతలపూడి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

కట్నం కోసం వేధిస్తున్న ముగ్గురిపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బండివారిగూడెం పంచాయతీలోని గంగినీడుపాలెం గ్రామానికి చెందిన కురేటి ధనలక్ష్మిని ఆమె భర్త సుబ్రహ్మణ్యం, అత్త, ఆడపడుచులు తక్కువ కట్నం తెచ్చావని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని ధనలక్ష్మీ ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్ఐ డి.దుర్గా మహేశ్వర రావు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముమ్మరంగా మినుము తీతలు

పంట దిగుబడులపై రైతుల ఆందోళన
అధిక ఎండలకు ముందే తిరగబడిన పంట

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి మండలంలో రెండో పంట మినుము తీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గత పది రోజుల నుంచి రైతులు కూలీలతో మినుము తీతలు తీయిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పనిచేసే కూలీకి రూ.500 చొప్పున కూలీగా చెల్లిస్తున్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా మినుము తీతలు ఊపందుకున్నాయి. కూలీల కొరత కారణంగా కొందరు రైతులు ఇతర జిల్లాల నుంచి కూలీలను తీసుకువచ్చి తమ పని అయ్యేవరకు వారికి నివాసం ఏర్పాటు చేసి కూలీతో పాటు బియ్యాన్ని బత్తెంగా ఇస్తుంటారు. దీంతో స్థానిక కూలీలతో పాటు వలస కూలీలు కూడా మినుము తీత పనుల్లో పాల్గొనడంతో మినుము తీతలు ముమ్మరంగా జరుగుతున్నాయి.




మినుము తీతలు తీస్తున్న కూలీలు

దిగుబడులపై అకాల వర్ష ప్రభావం: డిసెంబర్‌లో కురిసిన అధిక వర్షం పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపింది. విత్తనాలు చల్లిన రెండు రోజులకే డిసెంబర్ రెండో తేదీన కురిసిన భారీ వర్షం కారణంగా విత్తనాలు కూలిపోయాయి. 20 రోజులు పొలాల్లో నీరు నిల్వ ఉండడంతో చల్లిన విత్తనాలు నీటిలో నాని కూలిపోయాయి. దీంతో చేసేదేం లేక రైతులు మరోసారి విత్తనాలు కొనుగోలు చేసి చల్లారు. దీంతో నెల రోజులు ఆలస్యంగా విత్తనాలు వేయడంతో పంట దిగుబడులపై ప్రభావం పడినట్లు రైతులు చెబుతున్నారు. అదే ఏడాది ఎకరాకు 8 బస్తాలు అయితే, ప్రస్తుతం ఎకరానికి మూడు బస్తాలు కూడా అయ్యే పరిస్థితి లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక వర్షాల కారణంగా రెండోసారి వేసిన పంట నెల రోజులు పాటు ఆలస్యం కావడం, ఫిబ్రవరిలోనే అధిక ఎండలు కాయడంతో ఎండ ప్రభావం కూడా పంట దిగుబడిలపై పడినట్లు కౌలురైతులు చెబుతున్నారు. అధిక ఎండ కారణంగా 90 రోజులకు కోతకు రావలసిన పంట 70 రోజులకే ఎండలకు తిరగబడిపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా పంట దిగుబడులపై ఎండ ప్రభావం పడినట్లు కౌలు రైతులు చెబుతున్నారు. ఈసారి మినుము పంట ఏమాత్రం ఆశాజనకంగా లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేదంటున్నారు. ఈసారి అధిక వర్షాలు, అధిక ఎండలు వల్ల పంటపై పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదని పలువురు కౌలు రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

భూమిపై హక్కు కల్పించాలని వినతి

ప్రజాశక్తి - నిడమర్రు

తమ నివాస భూములకు నిషేధం తొలగించి హక్కులు కల్పించాలని మండలంలోని పత్తేపురం గ్రామస్తులు గణపవరం సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈమేరకు గణపవరం సబ్ రిజిస్టర్ కార్యాలయం అధికారి బిహెచ్.లక్ష్మికి వినతిని అందించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ మాట్లాడుతూ బాధితలు 20 కుటుంబాలు 1955 నుంచి కొనుగోలు చేసిన నివాస భూములకు 2019 వరకు యథావిధిగా రిజిస్ట్రేషన్ జరిగాయన్నారు. 2020 నుంచి సబ్ రిజిస్టర్ కార్యాలయం వారు నిషేధిత భూములుగా 225/1, 225 /10 సర్వే నెం చేర్చి మా భూములపై మాకు హక్కులు లేకుండా చేశారని, మాకు అన్యాయం జరుగుతుందని బాధితులు ఆరోపించారన్నారు. కో కుటుంబానికి నాలుగు, ఐదు, ఆరు సెంట్లలో భూములు కొనుగోలు చేసి నివాసాలు ఉంటూ కరెంట్ బిల్లులు, ఇంటి పన్నులు, పంచాయతీలకు చెల్లించుతున్నారని తెలిపారు. వెంటనే ఆ భూములపై నిషేధం ఎత్తివేసి బాధితులకు భూములకు హక్కులు కల్పించాలని సబ్ రిజిస్టర్ కార్యాలయం అధికారికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.వరలక్ష్మి, పొత్తూరు పద్మావతి, కుక్కల రాజేశ్వరి, రుద్రరాజు జానకి, వేగేషన్ సుబ్బలక్ష్మి, నడింపల్లి లక్ష్మి, వెలగలేటి మోహన పాల్గొన్నారు.



సబ్‌రిజిస్టర్ కార్యాలయం వద్ద గ్రామస్తులు

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాబోయే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని ఎఐటియుసి చింతలపూడి ఏరియా గౌరవ అధ్యక్షులు టివిఎస్.రాజు కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు. మండలంలోని మక్కినవారిగూడెం ఎఐటియుసి కార్యాలయంలో ముఠావర్కర్స్ యూనియన్ సమావేశం మల్లెల సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాజు మాట్లాడుతూ మతోన్మాద బిజెపిని అవకాశవాదులైన టిడిపి, జనసేన, ఆర్థిక నేరస్థుడు జగన్మోహన్ రెడ్డిని చిత్తుగా ఓడించి సిపిఐ, సిపిఎం భాగస్వాములుగా ఉన్న ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నరేంద్ర మోడీ విశాఖ ఉక్కు లాంటి పరిశ్రమలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టి దేశంలో నిరుద్యోగం పెంచాడని విమర్శించారు. విభజన హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యాడన్నారు. గత ఎన్నికల్లో నరేంద్ర మోడీని దారుణంగా దూషించిన చంద్రబాబు కాషాయ కూటమిలో చేరడం ఆయన అవకాశవాదానికి నిదర్శనం అన్నారు. రానున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తున్న ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించి మతోన్మాద బిజెపి, అవకాశవాద టిడిపి, జనసేన, వైసిపిలను చిత్తుగా ఓడించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి చింతలపూడి ఏరియా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస రావు, ముఠావర్కర్స్ యూనియన్ కార్యదర్శి సతీష్, సుబ్బారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పాముకాటుకు గురైన మహిళకు మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి - ముసునూరు

పాముకాటుకు గురైన మహిళ త్వరగా కోలుకుని ఇంటికి తిరిగి రావాలని నూజివీడు నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి అభ్యర్థి కొలుసు పార్థసారథి, నూజివీడు నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి, మాజీ ఎంఎల్ఎ ముద్రబోయిన వెంకటేశ్వరరావులు ఆకాంక్షించారు. ముసునూరు మండలం, కాట్రేనిపాడు గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త పిన్నిబోయిన వీరయ్య కుమార్తె అంగడాల భవాని పాము కాటుకు గురికావడంతో ఆమె నూజివీడు అమెరికన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆ సమాచారం తెలుసుకున్న కొలుసు ప్రార్థసారథి, ముద్రబోయిన వెంకటేశ్వరరావులు ఆసుపత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. అనంతరం ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, ఆమెకు మెరుగైన వైద్యం చేయాలని కోరారు. ఆమె కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.



ఫ్లెక్సీలు తొలగిస్తున్న అధికారులు

ఫ్లెక్సీలు తొలగించిన అధికారులు

ప్రజాశక్తి - కలిదిండి

ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో కలిదిండి ప్రధాన సెంటర్‌తో పాటు పలు గ్రామాల్లో అధికారులు విస్తృతంగా పర్యటిస్తున్నారు. పలుచోట్ల నుంచి వస్తున్న సమాచారంతో పాటు స్వయంగా పరిశీలిస్తూ ఫ్లెక్సీలు, హోర్డింగులను తొలగిస్తున్నారు. క్షేత్రస్థాయి పరిశీలనలో నిమగ్నమయ్యారు. తహశీల్దార్ వంశీ, ఎంపిడిఒ దినతేజ్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి సిహెచ్.విశ్వ కుమార్, ఇఒపిఆర్‌డి రాజారావు, పంచాయతీ, రెవెన్యూ, సచివాలయ, మండల పరిషత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసుల కవాతు

ప్రజాశక్తి - ముదినేపల్లి

జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి ఉత్తర్వుల మేరకు సోమవారం ముదినేపల్లి మండలంలో సిఆర్‌పిఎఫ్ సిబ్బంది కవాతు నిర్వహించారు. ఎస్ఐ డి.వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు రోడ్‌మార్చ్ నిర్వహించారు. మండలంలోని గురజ, దేవపూడి, సింగరాయపాలెం, ముదినేపల్లి సెంటర్లలో సిఆర్‌పిఎఫ్ సిబ్బంది రాబోవు జనరల్ ఎలక్షన్ నిమిత్తం ఓటర్లు స్వచ్ఛందంగా వారి ఓటు హక్కు వినియోగించుకునేలా ఓటర్లకు మనోధైర్యం కల్పించేందుకు పోలీసులు కవాతు నిర్వహించారు.

రోడ్డు వేయిస్తా : రోషన్

ప్రజాశక్తి - చింతలపూడి

ఎన్నో సంవత్సరాలుగా రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నారని, రోడ్డు వేయించి, ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తానని సొంగ రోషన్ కుమార్ హామీ ఇచ్చారు. చింతలపూడి మండలం పట్టాయిగూడెంలో శంఖరావం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామవరంలో ప్రజల సమస్యలు తెలుసుకున్నానని, ప్రతి సమస్య పరిష్కారానికి, అధికారంలోకి వచ్చిన తర్వాత, పార్టీ కార్యకర్తల నాయకులతో కూర్చొని, రోడ్డు సమస్యను, ప్రజల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గత పాలకులు గెలిచిన తర్వాత పట్టించుకోలేదని విమర్శలు వస్తున్నాయని, సంవత్సరానికి రెండుసార్లు ఈ గ్రామాల్లో పర్యటిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి జగ్గవరపు ముత్తారెడ్డి, నామవరం టిడిపి నాయకులు గోపి, సర్పంచి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



శంఖారావం కార్యక్రమంలో చిన్నారితో సొంగరోషన్

ప్రభుత్వ ఆస్తులు కాపాడాలి : సర్పంచి

ప్రజాశక్తి - కామవరపుకోట

ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని సర్పంచి గూడపాటి కేశవరావు కోరారు. ఆడమిల్లి గ్రామ పంచాయతీలో జగనన్న కాలనీ కోసం ప్రభుత్వం మూడు ఎకరాల ఇరువై సెంట్ల భూమి కేటాయించింది. సదరు కేటాయించిన స్థలంలో ఆడమిల్లి గ్రామపంచాయతీకి సంబంధించిన లబ్ధిదారులకు లేఅవుట్ వేసి ప్లాట్‌గా విభజించి లబ్ధిదారులకు అప్పగించారు. వారికి మౌలిక వసతుల కల్పనలో భాగంగా మంచినీటి సదుపాయం కోసం ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో గ్రామంలోని ఒక వ్యక్తి అక్రమంగా షెడ్ వేసి ఆక్రమించికున్నారని ఆడమిల్లి సర్పంచి గూడపాటి కేశవరావు తెలిపారు. సదరు విషయంపై తాను ఉన్నతాధికారులకి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలియజేశారు. సంబంధిత అధికారులు ఈ విషయమై వెంటనే స్పందించి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సర్పంచి కోరారు.



జగనన్న లేఅవుట్‌లో అక్రమంగా వేసిన షెడ్

కారులో తరలిస్తున్న నగదు సీజ్

ప్రజాశక్తి - భీమడోలు

నిబంధనలను అతిక్రమించిన కారులో ఎక్కువ మొత్తంలో నగదు ఉన్న కారణంగా నగదు సీజ్ చేసినట్లు తనిఖీ కేంద్రం అధికారి ఎ.మాధవరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో భీమడోలు రైల్వే గేట్ వద్ద ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రం వద్ద రావులపాలెం గ్రామానికి చెందిన గుత్తేదారు కె.జగదీష్ ఏలూరు నుంచి రావులపాలెం కారులో వెళుతున్నారు. భీమడోలు రైల్వే గేట్ వద్ద ఏర్పాటుచేసిన తనిఖీ కేంద్రం బృందం కారును పరిశీలించగా దానిలో రూ.2.50 లక్షలు ఉన్నట్లు గుర్తించారు. అంత మొత్తం నగదు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కారణంగా నగదును సీజ్ చేసి ఏలూరులోని ఉన్నతాధికారుల కార్యాలయంలో అప్పగించినట్లు తనిఖీ బృందం అధికారి తెలిపారు.




విచారణ చేస్తున్న అధికారులు

విద్యార్థినికి అస్వస్థత

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని ఎల్‌బి చర్ల గురుకుల పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థిని అస్వస్థతకు గురైంది. యర్రంశెట్టివారిపాలెం హైస్కూల్ విద్యార్థిని చింతా రుక్మిణికి ఆదివారం నీరసంగా ఉండి వాంతులు కావడంతో ఆర్ఎంపి డాక్టర్‌కి చూపించారు. సోమవారం ఎల్‌బి చర్ల గురుకుల పాఠశాలలో తెలుగు పరీక్ష రాస్తుండగా నీరసానికి గురై వాంతులు అయ్యాయి. దీంతో ఆరోగ్య సిబ్బంది ఆ విద్యార్థినికి మాత్రలు ఇచ్చారు. ఆ విద్యార్థిని ఆ నీరసంతోనే పరీక్షను పూర్తి చేసింది. అనంతరం అనంతరం తల్లిదండ్రులు ఆమెను 108 అంబులెన్స్‌లో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు.



విద్యార్థినిని ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

వైసిపి నాయకుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - కామవరపుకోట

కామవరపుకోటలో వైసిపి నాయకుల ఆత్మీయ సమావేశానికి చింతలపూడి నియోజకవర్గ వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయరాజు విచ్చేశారు. తొలుత ఆడమిల్లి సెంటర్‌లోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం నుంచి సభా ప్రాంగణం వద్దకు గ్రామస్తులు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న విజయరాజుకి ప్రజలు నీరాజనాలు పలుకుతూ పూలవర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి కడిమి రమేష్, పార్టీ ప్రెసిడెంట్ రమేష్, చింతలపూడి మాజీ ఎఎంసి చైర్మన్ మెడవరపు అశోక్, వీరిశెట్టి గూడెం సర్పంచి దేవరపల్లి బుజ్జి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉప్పునీటి బోరు తవ్వకాలు నిలిపివేత

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కొలనపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సూర్యారావుపేటలో కె.లంకఛానల్‌ను ఆనుకుని అక్రమంగా ఎటువంటి నిబంధనలను పాటించకుండా చెరువు తవ్వడం పలు విమర్శలకు దారి తీసింది. మొండికోడుకు చేర్చి అనధికారికంగా ఉప్పునీటి బోరు తవ్వకం పనులు చేపడుతున్నారని, అనుమతి లేకుండా బోర్లు వేస్తున్నారనికొలనపల్లి గ్రామం సూర్యారావు పేట వరి రైతులు మత్స్యశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రెడ్డి హనుమంతరావుకు చెందిన ఆర్ఎస్ నెంబర్ 407-4ఎ, 3ఎలో ఎకరం విస్తీర్ణంలో చెరువు ఉందని, పంటకాలువకు ఆనుకుని రొయ్యల చెరువు తవ్వడంలో నిబంధనలు పాటించలేదని తెలిపారు. రొయ్యల చెరువు, ఉప్పునీటి బోరు తవ్వకాలను మండల మత్స్యశాఖాధికారిని ఎం.ఇందిరా ప్రియదర్శిని సోమవారం పరిశీలించారు. ఆ రైతుకు వెంటనే నోటీసులు జారీ చేసి బోరు తవ్వకాలను నిలిపివేస్తామని ఆమె తెలిపారు. ఆమెతో పాటు సీసలి మత్స్యశాఖ గ్రామ అధికారి తిరుమాని సత్యనారాయణ, కొలనపల్లి గ్రామ విఆర్ఒ రాజేష్ ఉన్నారు.

నరసాపురంలో రూ.5,467 కోట్లతో అభివృద్ధి

చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం నియోజకవర్గంలో అభివృద్ధికి, సంక్షేమానికి రూ.5,467 కోట్లు ఖర్చు చేశామని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. స్థానికంగా సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఇచ్చామన్నారు. నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చామన్నారు. ఈ నెల 18వ తేదీ నరసాపురం మండలంలోని గొంది గ్రామం నుంచి ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బర్రి వెంకటరమణ, వైఇఎస్, మురళి, కామన బుజ్జి పాల్గొన్నారు.

యువతిని మోసగించిన యువకుడికి జైలు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.రెండు వేలు జరిమానా విధించారు. ఎస్ఐ మారిలింగం తెలిపిన వివరాల ప్రకారం... 2019లో యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన పాలకొల్లు నాగరాజుపేటకు చెందిన ఉప్పల నరేష్‌పై అప్పట్లో కేసు నమోదైంది. అప్పటి సిఐ సిహెచ్.ఆంజనేయులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కేసు విచారణ జరిగిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏలూరు ఐదో అదనపు జిల్లా కోర్టు, మహిళా కోర్టు జడ్జి జి.రాజేశ్వరి నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ.రెండు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కేసులో ఫిర్యాదుదారిని తరపున ఎపిపి రామాంజనేయులు వాదనలు వినిపించారు. కేసులో సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టి నిందితుడికి శిక్ష పడేందుకు సహకరించిన కోర్టు కానిస్టేబుల్ ఎస్.మురళిని, కె.మంగాదేవి అభినందించారు.



కారులోంచి చెలరేగుతున్న మంటలు

ఆగి ఉన్న కారులో నుంచి మంటలు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని మాధవాయిపాలెం రేవు వద్ద ఆగి ఉన్న కారులో నుంచి మంటలు చెలరేగాయి. సోమవారం సాయంత్రం పంటి రేవు వద్ద కుటుంబసభ్యులతో ఆగి ఉన్న కారులో మంటలు చెలరేగాయి. దీంతో కారులో ఉన్న వారు కిందకి దిగిపోయారు. స్థానికులు వెంటనే స్పందించి మంటలను అదుపుచేశారు.